శ్రీ

# కవిత

గీ. విబుధలోకంబు "కవితైవ విద్య" యనుచుఁ
జదువు వచనార్థమును నరశయము గలదె
విద్యలకు నెల్ల నుత్తమవిద్య కవిత
దానిఁ దెలియుట విశ్వమాతయను గాదె.

ఇది మాసమునకొకసారి ప్రకటింపబడును.

సంపుటము 1 } విరోధికృన్నామసం॥ర వైశాఖ మాసము. { సంచిక 12

## న్యాయచంద్రిక.

### భిక్షుకపాదప్రసారణన్యాయము.

భిక్షుకుఁడు గృహస్థునియింట భోజనశయనాదిలాభము నపేక్షించియు, నొక్కమాటు తన యభీష్టము నంతయు వెలిపుచ్చినఁ బాదప్రసారణమును దుర్ఘటమని యెంచి, మొదట నిస్పృహునిఁబోలెఁ బ్రవేశించి క్రమముగాఁ దనకోరికలను బ్రకటించి కృతార్థుఁడగును. అట్లే విశేషలాభమును గోరువారు నిరపేక్షులవలెఁ జేరుదురు.

### ఖల్వాటబిల్వీయన్యాయము.

బట్టతలవాఁడు పట్టపగలింటి యెండ తాఁకునకోడి నీడం గోరుచు మారేడుచెట్టుక్రిందికరుగుటయుఁ బండు రాలి యాతనిశిరముపైఁ బడి గాయపఱిచెను. అట్లే యదృష్టహీనుఁ డెందేఁగిన నాపదలు ప్రాపించును.

### ఉష్ట్రకంటకభక్షణన్యాయము.

లొట్టిపిట్ట ముళ్లుగుచ్చుకొనుట వెతగుడుచుచును, జమ్మ్రియాకు లందిని సుఖించును. అట్లేజనుఁడభీష్టవస్తువుల నార్జింప దుఃఖపడుచును, దల్లాభమున్న కలరును.

### కాశకుశావలంబనన్యాయము.

ఏటఁబడి కొట్టుకొని పోవువాఁడు పెద్దకొమ్మలు మొదలగునవి దొరకనిచో రెల్లుపుడుకనుగాని దర్భకట్టనుగాని పట్టుకొనుట నిరర్థకము. అట్లే ప్రబలయుక్తులు తోఁచనితఱి దుర్బలయుక్తుల నవలంబించువాఁడు నవ్వులపాలగును.

### విషక్రిమిన్యాయము.

వసనాభిలోఁబుట్టిన పురువును వసనాభియే పోషించును. అట్లే తన దేశపుదుర్న్యాయము తన్నురక్షించును.

### విషవృక్షన్యాయము.

విషవృక్షమునైనఁ దాఁబెంచినదానిని నఱుకఁ జనదు. అట్లే దుర్జనునైనఁ దాఁ బోషించినవాని హింసింపరాదు.

### శ్యేనకపోతీయన్యాయము.

డేగ యతర్కితముగావచ్చి పావురముఁ దన్నుకొనిపోవును. అట్లే దుర్యోగమాకస్మికముగా మనుజుని లోఁచుకొనును.

### గడ్డరికాప్రవాహన్యాయము.

గొఱ్ఱెలగుంపులో నొకటి ప్రమాదముననేని ప్రవాహంబునఁ బడినచో నెంతనివారించినను దక్కినవన్నియుఁ దోడనవఱుతదూఁకును. అట్లే తమవాఁడొకఁడు పొరపాటుననేని తప్పుదారిఁబోవ నెల్లరునువాని వెంటఁ బరువిడుదురు.

### గోమయపాయసీయన్యాయము.

"గోవులవలనఁ గలుగుటఁ బాయసమును గోమయమే" అని యెట్లోసాధించిననది పరిహాసపాత్రమగును. అట్లేయపశబ్దము నెవ్వియో యుక్తులుచెప్పి సాధించినను బుధులు గ్రహింపరు.